ఏ రోజు నాయనమ్మ తన పెళ్ళి చూడాలని, ఏ రోజు ఎలాంటిదో అనుకుని, ఓ వధువు మెళ్ళో మంగళ సూత్రం కట్టేశాడు శ్రీపతి. ఎప్పటి కప్పుడు ముసలమ్మ చచ్చిపోతుం దనుకోవటమే తప్ప యింతవరకు చావనే చావలేదు. ఇంకా నేను బ్రతికి ఏం సార్థకం నాయనా యీ ఘటం యీ మాదిరిగానన్నా వెళ్ళి పోతే అదే పదివేలు అంటూ ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేదాకా వందసార్లయినా అంటూ వుంటుంది. కాని యిట్టే కాస్త జ్వరం వచ్చిందంటే చాలు, నేను చచ్చిపోతున్నా డాక్టర్ని తీసుకురండ్రా అంటూ గోల పెడుతూ వుంటుంది. కొంటె తనానికి ఎవరైనా ఎగతాళి క్రింద పట్టించి, చూడు మామ్మ డాక్టర్ డాక్టర్ అని ఎట్లా కలవరిస్తోందో అంటే, ఓరి పిచ్చి వెధవా, నా కోసంట్రా డాక్టర్ని పిలవ మనేది, నేను కనక మంచాన పడ్డానంటే మీ మచ్చ మాస్తుందని అంటున్నానే గాని లేకపోతే యీ క్షణాన కృష్ణా, రామా అనుకుంటూ దాటిపోను అంటూ దీర్ఘాలు తీస్తుంది.

తాను మామ్మ దగ్గర పెరిగిన మమకారంవల్ల శ్రీపతికి ఆమెయందు అమితమైన భక్తి, గౌరవాలు వున్నాయి. మామ్మకు యిష్టమైన పనులన్నీ చెయ్యాలి అని అతని సంకల్పం. అందుకనే త్వరలో మాలతిని పెళ్ళి చేసుకున్నాడు. తన కేదో యీ విషయంలో ఓ పెద్ద బాధ్యత అప్పట్లో అదికాస్తా తీరిపోయినట్లు అతని భావం. వస్తే కాపరం పెట్టినప్పుడు మామ్మ, మా దగ్గరే వుండాలి అని పట్టుపట్టి తీసుకువచ్చాడు ఆమెను.

నెత్తిన పెట్టుకుని పూజించాలి. మా అమ్మ, నాన్న పోయినప్పటినుంచి నన్ను ఎంతయిదిగా పెంచిందో చెబితే తీరదు. కన్నతల్లి కూడా అట్లా చెయ్యలేదు. ఆమె ఋణము నేను ఎట్లా తీర్చుకుంటానో ఏమో ఇదే ధోరణిగా మాట్లాడుతూ వుంటాడు మాలతితో శ్రీపతి.

"మాలతీ ఏం చేస్తున్నావే! నిన్ను కాదు పిలిచేది! అని ఆ కేకలు పెడుతుంటే నువ్వే మొద్దులాగా పలక్కుండా ఏం చేస్తున్నట్టు! ఏం కావాలో ఏమిటో కనుక్కో ముందర. మన పనులు తర్వాతనే చేసుకోవచ్చు." శ్రీపతి చిరాకు పడుతూ అరుస్తాడు.

"ఇంట్లో ఓ మూల పనితో సతమత మవుతుంటే అన్నిసార్లు పిలవటమేమిటి! పిలుంటే నేను రావా! చెప్పిన యింతయిది నే నెక్కడా చూడలా...!" మాలతి రుస రుస లాడుతూ, చెంబెడు నీళ్ళు ముసలమ్మ మంచం దగ్గర పెట్టింది.

"మాలతీ నీకు తెలీదు, నాకు ఎట్లా చేసిందో ఎట్లా పెట్టిందో అవన్నీ తలుచుకుంటుంటే నా గుండె తరుక్కుపోతోంది. ఏమాత్రం అశ్రద్ధ ఆమె చేసినా, నేను యివ్వాళ యీ స్థితిలో వుండేవాణ్ణి కాదు. నా చదువుకు, నా ఆరోగ్యానికి, నా క్షేమానికి అంతా ఆమే మూలాధారం. చివరకు నిన్ను పెళ్ళి చేసుకోవటానికి కూడా మా మామ్మే కారణం....." ఎగతాళి క్రింద పట్టించి, శతవిధాల మాలతిని ఆమె పరిచర్యల వైపు మళ్ళించాలని ప్రయత్నం చేస్తూ వచ్చాడు.

మాలతికి ఓ పట్టాన తన భర్తయొక్క ఆవేదన అర్థం కావటం లేదు. ఎంతో గంభీరంగా శ్రీపతి తన మామ్మ విషయం చెప్పుకుపోతుంటే, విన్నంత సేపు విని, ఓస్ యింతే గదా అని చప్పరించి వూరుకుంటుంది మాలతి. శ్రీపతి మండి పడతాడు. ఓసారి గాథాలు ముసలమ్మ చెప్పినదానికి పూర్తిగా వ్యతిరేకంగా చేసి, మెదలకుండా కూర్చుంది మాలతి. శ్రీపతి యిట్టే పట్టేశాడు. బుజ్జగించటం, కోప్పడి చెప్పటం అయిపోయాయి. కాని మాలతి ప్రవర్తనలో మార్పేమీ కనిపించటం లేదు. చాలా ఘర్షణగా మాట్లాడుతున్నాడు. భార్య కూడా తగ్గట్టుగానే సమాధానం చెప్తోంది.

"అమ్మాయి ఏమిట్రా అంటుంది నాయనా..." మనమని కళ్ళల్లోకి చూసింది.

"దానికి వళ్ళు పొగరు బాగా ఎక్కువయి పోయింది. నేను చెప్తాన్లే దాని పని....నువ్వు వూరుకో" అంటూ రెండడుగులు ముందుకు వేశాడు శ్రీపతి.

"చిన్నతనంరా, దాని కేం తెలీదు. తెలిసేట్టు చెప్పి చేయించుకోవాలి. అంతే కాని నువ్వుకూడా కోపం తెచ్చుకుంటే ఎట్లాగురా. అయినా యింతకే ఏమయ్యింది కనక!....."

"ఏమన్నా అంటుంది వూరుకుంటుంటే...." గుడ్లురిమాడు వంటింట్లో సణుగుతున్న మాలతి దగ్గరకు చెర్రున వెళ్ళాడు. లేడి పిల్లలాగ బిత్తర చూపులు చూసుకుంటూ గజగజ వణికి పోయింది మాలతి. రెండు చేతులు అడ్డంగా పెట్టుకుని, వెనక్కు వెనక్కు జరుగుతూ హీనస్వరంతో నే నేమన్నానని, నే నేమన్నానని అన్నది. శ్రీపతి అహంకారం తగ్గలేదు. మాలతి రెండు చేతులు తప్పించుకుని శ్రీపతి కుడిచెయ్యి చురుకుగా మాలతి చెంప మీద పడింది. మాలతి కళ్ళ వెంబడి బొట బొట నీళ్ళు వచ్చినాయి. శ్రీపతి వాలకం చూస్తే, ఏమన్నా మాసేస్తావా, యింకోటి తగిలించమంటావా అన్నట్లుంది. చప్పున కొంగుతో కళ్ళ రెప్పలు అద్దుకుని నిమిషాలమీద వంటలు చేసేసి, ముసలమ్మ దగ్గరకు వచ్చేసింది, తెచ్చుకున్న నవ్వు పారిపోకుండా చూసుకుంటూ.

మాలతి వంక ఓ క్షణం చూసి, ఏమిటే అమ్మాయి మొహం అట్లా కందగడ్డలాగ ఎర్రగా అయిపోయింది. వాడేమన్నా అఘాయిత్యం చేశాడా ఏమిటి!...." విడ్డూరంగా చూసింది.

"ఏం లేదండీ! పొగ కళ్ళల్లోకి పోయింది. ఎన్నిసార్లు చెప్పినా పచ్చి మొద్దులు తెచ్చి తగలేస్తారు. ఆ నీళ్ళు ఓ పట్టాన కాగవు. నా రెక్కలు పూడిపోవాల్సిందే....." అన్నది గడగడ మాలతి.

తాను కొట్టానని చెప్తుతుంది ఎట్లాగో యిలాంటి వాళ్ళను కొట్టాలా యింకేమన్నా చెయ్యాలా, ఏం చేస్తోందో నీ కేం తెలుసు అంటూ భార్య చేస్తున్న పనులన్నింటిని ఏకరువు పెట్టటానికి తయారయి శ్రీపతి యీ మాటలు వినేటప్పటికి చప్పున చల్లబడి పోయి, కిటికీలోంచి మాలతి వంక చూస్తూ, మాలతిని చాలా మెచ్చుకున్నాడు. అయితే తన కోపం యిట్టే తగ్గిపోయినట్లు తెలియపరచటం యిష్టంలేక, చిరుబుర్రు లాడుతూనే వున్నాడు. అదిచెయ్యి యిది చెయ్యి అంటూ అధారిటీగా పురమాయిస్తున్నాడు. భర్త చెయ్యి దురి చూపినప్పటినుంచి అబ్బ, మగవాడు. ఎంతకైనా తగును అనుకుంది. ఓ విధమైన భయము ఏర్పడింది, తన పోళ్ళతో విశ్రమము నిర్లక్ష్యం రూపాన్ని తాల్చినాయి. రెండు మూడు రోజులవరకు ఎడమొహం పెడ మొహంగానే వుండిపోయారు.

ముసలమ్మ మాత్రం ప్రొద్దస్తమానం ఫ్యాక్టరీ గొట్టంలాగ ఏదో అరుస్తూనే వుంటుంది.

ఆనాడు ముసలమ్మ మధ్యాహ్నమప్పుడు గుర్రుపెట్టి నిద్రపోతోంది. మాలతి వంటింట్లో పిండి రుబ్బుతోంది. శ్రీపతి గదిలో మంచంమీద పడుకుని అట్టే ఆలోచించుకుంటున్నాడు. నిద్ర కను రెప్పలదాకా వచ్చేసి, యిట్టే మాయమైపోతోంది. మాలతి పిలుస్తుందేమో అప్పట్లో తన బింకం అంత మయ్యేదాక నిరీక్షిస్తూ కూర్చున్నాడు. మాలతి పని పూర్తి చేసుకుని, చాపేసుకుని నిద్రపోయింది. శ్రీపతికి వళ్ళంతా జెర్రులు ప్రాకినట్లు అయిపోయింది. ఎంతసేపటికీ భార్య తన దగ్గరకు రావటం లేదు. పోనీ తానే పిలుద్దామా అంటే అభిమానం అడ్డం వచ్చేస్తోంది. మనస్సు నిబ్బరంలేక తనంతట తానే అడుగుల్లో అడుగులు వేసుకుంటూ మెల్లిగా వంటింట్లోకి వెళ్ళాడు. మాలతి నిద్రపోతోంది. నిద్ర ఎంతో అందంగా కనిపించింది. అట్లాగే ఆమె మొహంలోకి చూస్తూ నిలబడిపోయాడు. ఆమె లేత చెక్కిళ్ళు చూస్తుంటే, శ్రీపతి మనస్సు కరిగి పోయింది. తన అరచేతివైపు ఏహ్యంగా చూశాడు. ఏమిటో మనస్సులోకి వచ్చి బాధ పెట్టింది. గిర్రున తిరిగి గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. శ్రీపతి నిద్ర లేచేటోగా, మాలతి రుబ్బింది కాస్త, పెనంమీద వెయ్యటం అయిపోయింది. ముసలమ్మ ఫలహారం చేస్తోంది. భర్త లేచిన అలికిడి కనిపెట్టి, గదిలోకి వెళ్ళి "ఫలహారం యిక్కడకు తీసుకు రమ్మంటారా? వంటింట్లోకి వస్తారా?" అన్నది ముక్తసరిగా.

"ఆ....." అన్నాడు వినపడనట్లు శ్రీపతి. మళ్ళీ ఆ రెండు ముక్కలే అని సరాసరి మాలతి తిరిగి వచ్చేసింది. ముసలమ్మ ఫలహారం పూర్తికాలేదు. పళ్ళెంలో నాలుగు ముక్కలు పెట్టి, భర్తకు అందిచ్చింది. ఒకటి తీసుకొంటూ "నువ్వు తినవే" అన్నాడు చిరాకుగా.

తినేశాను అని చెప్పటానికి, ముందరే నీ పని అయిందన్నమాట అని అంటారేమో నని, అయిపోయినాయని చెప్తే మళ్ళీ ఏ రకంగా మాటలు వస్తాయోనని ఒక్క క్షణం ఆలోచించి, "అట్లా అయితే ఒకటివ్వండి" అంటూ చెయ్యి జాచ జాపింది. శ్రీపతి ఒకటి అందిస్తూ, అటూ యిటూ చూశాడు. అన్నీ ఖాళీ పాత్రలే!

మాలతి అనుకున్నాడు మనస్సులో.

ఆనాడు పెందరాళే అన్నం తిని, గదిలోకి వెళ్ళి దుప్పటి ముసుగుపెట్టుకుని పడుకున్నాడు. అమావాస్య చీకటి, చిరు చలి అప్పుడే ప్రారంభమయింది. శ్రీపతి చాలా బడలికగా వున్నాడు. మాలతి ఎప్పుడు వస్తుందా అని కనిపెట్టుకు కూర్చున్నాడు. రాంగానే ఏవో విషయాలు చెప్పదా మనుకుంటున్నాడు. తాను వచ్చి పడుకుని చాలాసేపయింది. భార్య ఎంతసేపటికీ రావటం లేదు. ముసలమ్మ మంచంలో మెసులుతోంది. అపశోపాలు పడుతోంది. శ్రీపతికి చిరాకు ఎక్కువయిపోతోంది. చివాలున మంచంమీదనుంచి లేచి, వంటింటి గుమ్మంలో నిలబడి "మంచినీళ్ళు" అని అరిచాడు. "మంచినీళ్ళు గదిలో పెట్టమని ఎన్నిసార్లు చెప్పాను" అన్నాడు విసురుగా.

"నేను వచ్చేటప్పుడు తీసుకు వస్తానుగా అని ముందునా పెట్ట లేదు"......అన్నది మెల్లగా.

"నువ్వెప్పుడో అర్ధరాత్రికి వస్తావని పీక ఎండబెట్టుకొని కూర్చోమంటావేమిటి?" అంటూనే మంచినీళ్ళు గడ గడ త్రాగేశాడు.

ఈ మాటల్లో వ్యంగ్యోక్తి యిట్టే కనిపెట్టేసింది మాలతి. లోపల నవ్వుకుంది. పైకి మాత్రం "ఏముందీ యీ యిల్లు వడిగంట, రావటమేగా!" అన్నది మెల్లగా.

శ్రీపతి ఓరకంటితో చూపు చూసి చిరాకుగా వెళ్ళి పడుకున్నాడు. మాలతి అవరా బావరాగా ఆ పనులు యీ పనులు పూర్తి చేసుకుని యిక రాబోతుంటే, ముసలమ్మ మూలుగు వినిపించి చప్పున అటు వెళ్ళింది.

"అమ్మాయి నువ్వేనా!"....అన్నది.

"నాకు ఆయాసంగానే వుందే...!" ఆ ముక్కలు నోటికి రుచిగా వున్నాయని నాలుగు ఎక్కువ తిన్నానో ఏం పాడో! బొత్తిగా ఆయాసంగా వుందే!" అంటూ మొదలుపెట్టింది.

"ఏ ఎక్కువ తిన్నా వేమిటి!....నేను చేసినవి ఎన్ని కనక!.......రాయమంటారా?"...మాలతి మంచం మీద కూర్చుని గుండె రాస్తోంది.

"అమ్మాయి! వాడితో యీ మాటనకమ్మ నవ్వుతాడు...." అన్నది.

శ్రీపతి చెవిదాకా ముసలమ్మ మూలుగుడు వచ్చేటప్పటికి అతను వచ్చేశాడు "ఏమిటి మామ్మా!" అంటూ.

"ఏంలేదు నాయనా! పెద్దతనం...ప్రతిదానికి నువ్వు అట్లా గాభరాపడితే ఎట్లాగురా......నేను నీ వయస్సులో రెక్కలు విరిగేటట్టు చాకిరీచేసేదాన్ని. దిట్టంగా తినేదాన్ని. ఇవ్వాళ యీ రెండూ చెయ్య లేను. అంతే!" అన్నది.

"తలనొప్పిగా వుందిట! బాధపడుతున్నారు మాలతి వుందేమిటి!....."

"డాక్టర్ని పిలుచుకు రమ్మంటావా!...." చప్పున అన్నాడు.

"ఏమని చెప్తావురా డాక్టరుతో. చావటానికి సిద్ధంగా ముసలమ్మ వుంది. ఆమె కేమో తలకాయ నొప్పి వచ్చింది రమ్మని—అంతేనా!...." ముసలమ్మ నవ్వు దగ్గుతో కలిసి శ్రీపతిదాకా రాలేదు. అయితే మాలతి నవ్వు ఆపుకోటానికి చేసిన ప్రయత్నం మాత్రం శ్రీపతి యిట్టే కనిపెట్టేశాడు. చిత్తుగా కాసిన ఎండ చల్లబడినట్లు, శ్రీపతి రౌద్రాకారం, మాలతి మొహం యిట్టే మార్చేసింది. ఆనాడు ముసలమ్మ పడ్డ బాధకంటే శ్రీపతే ఎక్కువ బాధపడ్డాడు. ఎప్పుడూ రాని కోపం వచ్చింది. ఏమిటో విసుక్కున్నాడు. తాను ఎంతో ఆదుర్దాగా మాలతి కోసం ఎదురుచూడటం, తీరా మాలతి రాకపోవటం, పైపెచ్చు ఆ మంచంలోవున్న ముసలమ్మకు వుపచారాలు చేస్తూవుండటం శ్రీపతికి వింతగా తోచింది. ఆనాటి నుంచి శ్రీపతి మనస్సు అటూ యిటూ వూగిపోతోంది.

ఎప్పుడు మాలతిని పిలిచినా ఏదో పనితో వుంటూ వుంటుంది. ఈ పనులకు అంతేమీ వుండ దేమిటి అనుకుంటున్నాడు. గట్టిగా మాట్లాడితేసరి, శ్రీపతికి సమాధానంగా మామ్మగారి పనితో వున్నా నంటూ వుంటుంది. మారు మాట్లాడటానికి అవకాశం వుండదు. "మీరే కాదండీ, మామ్మగార్ని పూలల్లో పెట్టి పూజించాలని చెప్పింది, ఆమెగారి పనిమీద వుంటే, నన్ను అంత విసుక్కుంటా రేమిటి!" అంటుంది మాలతి. శ్రీపతికి ఏమీ అనటానికి అవకాశం చిక్కక అహంకారాన్ని అణచుకుని సరే అంటూ రాత్రిందనే రావడి యిచ్చి మాట్లాడి వెళ్ళిపోయాడు. ఇంకో మెట్టు కూడా ఎక్కి భర్తను ఎత్తిపొడవటం కూడా నేర్చుకుంది. "ఏమో మొందరగా ఆమెగారి పని చెయ్యకపోతే ఎడంచెయ్యి రుచి కూడా చూడాలని వస్తుందే అని భయం" అంటూ వుంటుంది మాలతి. ఈ నాటి పోటి మాటలకు శ్రీపతి శరీరం పెంచుకుంటాడు.

ఈ సంవత్సరంలో ముసలమ్మకు మూడు గండాలు గడిచినాయి. తనను తాను తిట్టుకుంటుంది. ఇంకా నామీద దయ రాలేదా నీకు, నన్ను తీసుకుపోకుండా ఎందుకు వుంచినట్లు అని గోలచేస్తూ వుంటుంది. రాను రాను అవయవ పటుత్వము తగ్గిపోతోంది. చూపు కూడా అట్టే ఆనటం లేదు. ఆనవాలు పడుతుంది అంతే! లోపల లోపల గొణుక్కుంటుంది. పిటికి మాటికి ఒకే అబ్బాయి అంటూ బిగ్గరగా అరుస్తుంది. ఏమిటి మామ్మా అని దగ్గరకు వచ్చిన తర్వాత, ఏం లేదు నాయనా ఏం చేస్తున్నావో అని పిలిచాను అంతే అంటుంది. అన్ని విషయాల్లోనూ జోక్యం కలుగజేసుకుంటుంది. ప్రతిదానికి రాచిరాచి అడుగుతుంది. ఏ ఒక సమాధానం కూడా ఆమెకు తృప్తి నివ్వదు. ఆమెకు నచ్చిన సమాధానం వచ్చేటంతవరకు పట్టించి పట్టించి అడుగుతూనే వుంటుంది. ఎంత సహనం వున్న వాళ్ళైనా, ఇట్టే విసుక్కోవాలసిందే!

"ఏమండీ మరచిపోయారా మీరు, రాత్రనక పగలనక ప్రొద్దస్తమానం మామ్మగారి విషయమే ఆలోచిస్తూ కూర్చునేవారు. అలాంటిది, మామ్మగారు ఏ చిన్న విషయం చెప్పినా అట్లా చిదిలించి మాట్లాడుతారు. పాపం వారి మనస్సు ఎంత కష్టపడుతుంది చెప్పండి. చిన్నప్పటినుంచి మిమ్మల్ని పెంచి పెద్దవార్ని చేశారు. ఎంత సహనంతో చేశారో ఏమో! మీరు ఈ కాస్త దానికి ఇంత ఇదైతే ఎట్లాగు . . . ! మాలతి తన కసిదీరా అంటుంది.

ఇదిగో నువ్వు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోక . . . నీ పనేమిటో నువ్వు చూసుకో . . .' గదమాయించి వూరుకుంటాడు.


ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ, మామ్మ నీ కెన్నేళ్ళు అని అడిగాడు శ్రీపతి.

'చచ్చే ఈడేరా నాయనా! వాడికి దయ రావద్దూ నామీద . . . ' అంటూ కొరకొర సమాధానం చెప్పింది. ముసలమ్మకు పెద్ద అభిమానం మాట వుంచుకోదు. ఎప్పటి మాటకు అప్పుడు వడ్డీతో సహా చెల్లించాల్సిందే!

'ఒసేయ్! ఏమేమో అనుకున్నా! వాడు పూర్తిగా మారిపోయాడే! . . . నన్ను చూస్తే చిరాకు పడతాడు! . . . నేను ఏం చేశాను! పెంచి పెద్దవాణ్ణి చేశా అంతేనా! ఇంతకన్నా ఏమన్నా ద్రోహం చేశానా!' అంటూ వుంటుంది.

ఏమయినా, పిల్లిద్దరికీ, ఈ ముసలమ్మ ఓ గుదిబండలా తయారయింది. ఇద్దరూ బజారుకు వెళ్ళడానికి ఆస్కారం లేదు. ఏ గొడవలయినా చెప్పుకయితే సరి, ఏమ్మ్రాయ్ నన్ను ఒక్కత్తెనూ ఇంట్లో పెట్టి వెళ్ళిపోతున్నార్రా అంటూ అరుస్తుంది. భార్యా భర్తలు ఇద్దరూ దాసేపు నిశ్శాంతిగా కూచొని మాట్లాడడానికి వీలులేదు. క్షణక్షణానికి పిలుస్తూ వుంటుంది. ఏమాత్రం చిక్కక పోయినా ఆనాడు, ఇంటిని ఓ కొలిక్కి తెచ్చి పెడుతుంది. ఊళ్ళోకి మంచి సినిమా వచ్చింది గదా అని చూద్దా మనుకుంటే వీలుపడదు. నాలుగు గోడల మధ్య, ముసలమ్మతోపాటు మాలతి నలిగిపోతోంది. మాలతిని చూసి శ్రీపతి నిట్టూర్పు...

సులేఖ
కలాలు
తృప్తికి, సర్వీసుకు




ఇండియాలో సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
PENEMEN'S INDUSTRIAL SERVICES
Candivli (Bombay S.D.)
12, Shaushet Street, Bombay-2

న్నాడు. తమ యౌవనంలో శేకెత్తుతున్న వాంఛ అన్నీ చంపుకుని, ఏమీ చేతకాని అసమర్థులు లాగ, ముసలమ్మ మంచానికి తలొక వైపున దిగాలుపడి కూర్చుని వుంటారు.

ఎంత మనోవిబ్బరంగా వుండా మనుకున్నా, అహంకారంలో, మనస్సులో మాట దాగదు.

'మామ్మ నా కంఠానికి వురిగా వుంది . . . కదలటానికి వీల్లేదు. మెదలటానికి వీల్లేదు . . .' అని విసుక్కుంటూ వుంటాడు శ్రీపతి.

'పెద్దవారు . . . ఆ వయస్సు అలాంటిది . . . పాపం వారి వని ప్రయోజనం ఏముంది! పసి పిల్లలలాగే చూడాలి తప్పుతుందా మరి?' అంటూ నీతి పాఠం అప్పచెప్పుతుంది.

'ముసలాళ్ల కోసం ప్రత్యేకంగా ఓ ఆసుపత్రి వుంది. దాంట్లో చేరిపిస్తే . . .' ఆలోచించు కుంటున్నాడు.

'ఆమెగారు వెళ్ళుతుం దేమిటి! . . .' చప్పున అన్నది మాలతి.

'ఆ మాటా నిజమే! . . .'

ఎటూ ఆలోచన పోవటం లేదు. ముసలమ్మ రాత్రిళ్లు ఓ మాదిరిగా నిద్రపోతోంది గదా అని, భార్యమీద మోజుకొద్దీ, సంపెంగ, గులాబి పూలు తెస్తే, ఆనాడు పరీక్షగా, ముసలమ్మ తెల్లార్లు మేలుకుని ఇద్దరి ప్రాణాలు తోడేస్తుంది. ఇంత వేళకు విస్తట్లో పెడుతున్నారు గదా అని, తిని మంచంమీద హాయిగా పడుకుందామనే ధ్యాస లేదు. అన్ని అరాలు తనకే కావాలి! మాటకు సమాధానం చెప్పక పోతేనా, నా మాటంటే మీకు లక్ష్యం ముందీ, నేను ఇంట్లో వున్నట్లుంది మీకు, నా రెక్కలు విరిగేదాకా అందరూ చాకిరీ చేయించు కున్న వాళ్లే, ఇప్పాళవుతే ఎవ్వరికీ పనికిరాకుండా పోయాను కానీ అంటూ దెప్పి పొడుస్తుంది. కాకపోతే సాధిస్తుంది.

ఇంకా మామ్మ బ్రతకటం వలన ఉభయులకు కష్టాలే కాని, సుఖం వుండదని అనుకుంటున్నాడు శ్రీపతి. మాలతి నలిగిపోతోంది. చిన్న పనీ, పెద్ద పని ఒక్కర్తే చేసుకోవాలి. చేదోడు వాదోడుగా వచ్చే వాళ్లెవ్వరూ లేరు. పతమత మయిపోతోంది. భార్య ఇంత కష్టపడిపోతోందే అని శ్రీపతికి మానసిక బాధ. అది పైకి చెప్ప టానికి వీల్లేదు. లోపల లోపల కుళ్లి కుళ్లి బాధ పడుతున్నాడు.

ఇవిట్లా వుండగా, ముసలమ్మకు అదివరకు కంటె, చావంటే భయం ఏర్పడింది. ఇదీ ఓ తమాషాగానే వుంది.

జ్వరము వచ్చి, ఓ మూల బాధ పడుతోంది. డాక్టరు మందిచ్చాడు. చాల పెద్ద వయస్సు. ఈ వయస్సులో ఏ మందిచ్చినా ఒకటే! అంటూ వెళ్లిపోయాడు.

ఈ మాట ఎట్లా విన్నదో ఏమో! ముసలమ్మ ఆనాడల్లా ఎంత పెద్దదాన్నయితే మాత్రం, మందు ఇవ్వకుండా చంపారన్న అప్రతిష్ఠ తెచ్చుకోకండ్రా అంటూ ఒకటే శోకాలు. చిరాకు ఎక్కువయి పోతోంది. నీకు కళ్లు కనిపించటం లేదు మామ్మా అంటే తప్పు. నీకు వినిపించటం లేదంటే తప్పు. ప్రతి మాటకు తప్పు పట్టిస్తుంది. శ్రీపతికి భరించరాని బాధ అయిపోయింది. ఈ నరకం ఇంకా ఎన్నాళ్ళు అనుభవించాలి భగవంతుడా అని ప్రార్థిస్తూ వుంటాడు రాత్రిం బగళ్లు శ్రీపతి.

ముసలమ్మకు ప్రాణంమీద తీపి. శ్రీపతికి ముస లమ్మ మీద ఏవగింపు. మాలతికి భర్తకు పాఠం నేర్పాలనే ఆకాంక్ష—ఈ మూడింటివలన ఎవరి మనసులో వారు తీవ్రంగా ఆలోచించుకుంటూ బాధ పడుతున్నారు. కాల గమనంతో, వీరి మన స్సులు ఇంకా కలుషితా లయినాయి, మనస్పర్థలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. తనను ఇంకా సరిగా చూడడనే అభిప్రాయం ముసలమ్మకు దృఢంగా నాటుకు పోయింది. మనో వ్యాధికి మందు లేదు. వృద్ధాప్యానికి తిరుగు లేదు. ఈ రెండూ కలిసి, ముస లమ్మను కుంగదీసేసినాయి. డాక్టరు నయం చేయ లేని రోగాలు.

మాలతి, శ్రీపతి మంచానికి చెరో ప్రక్కన దిగాలుపడి కూర్చున్నారు. వాళ్లిద్దర్ని వదిలిపెట్టేసి, ముసలమ్మ అంతరాత్మ పంచభూతాల్లో కలిసి పోయింది. కట్టెలాంటి శరీరం మంచంమీద వుండి పోయింది.

శ్రీపతి కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. తన చిన్నతనం గుర్తు కొచ్చింది. మామ్మ తన కోసం ఏవిధంగా ఎన్నెన్ని కష్టాలు పడిందో ఒక్కొ క్కటే జ్ఞాపకం వస్తున్నాయి. తన బాగుకోసం, తన జీవితాన్ని బలి చేసిన మామ్మ ఇక లేదు. అవమానాలు భరించింది. అపనిందలు నెత్తిన వేసుకుంది. తన శరీర సుఖం చూచుకోలేదు. ఇంకా ఇంకా అనేకం గుర్తు కొచ్చినాయి.

శ్రీపతి గుండె పగిలేటట్లు ఏడ్చాడు. తన మనస్సులో ఏర్పడ్డ చెడ్డ ఆలోచనలకు ఎంతో బాధ పడ్డాడు. పాతికేళ్లు ఏకధాటిగా నన్ను పెంచింది. నాకు తల్లి తండ్రులు లేని లోపం లేకుండా చేసింది. కాని నేను మామ్మను సహనంగా చూడలేకపోయాను. గుండెలు బ్రద్దలయ్యేటట్లు ఏడుస్తూ, మామ్మా నన్ను క్షమించవూ అని బిగ్గరగా అరిచాడు. మాలతి కూడా దుఃఖం ఆపుకోలేకపోయింది. తన భర్త ఆవేదన తగ్గేటట్లు కనిపించడం లేదు. తానే కల్పించుకుని, 'పెద్దది పోయింది, అదృష్టవంతు రాలు, మీమీద అంత మమకారం, ప్రేమ పెట్టు కున్నప్పుడు మీ చేతిమీదుగా దాటి పోవడం కంటె, ఆవిడకు కావలసిం దేమిటి' అన్నది మాలతి ఆరిం దాగా.

'నేను మామ్మకు ద్రోహం చేశాను . . . ద్రోహం చేశాను . . .' గజగజ వణికిపోతూ శ్రీపతి హోరున ఏడ్చాడు.

*

